సాక్షి కర్నూలు

సోమవారం ¦ 27 ¦ మార్చి ¦ 2023



భ్రామరికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామి వార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించి ఆలయ ప్రదక్షిణ చేశారు.



నాటకం.. రసరమ్యం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఐదారు దశాబ్దాలుగా నాటక రంగం మహా వృక్షంలా ఎదుగుతూ వస్తోంది. సోమవారం అంతర్జాతీయ రంగస్థల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

8లో



పౌర పోలీసులు చూస్తున్నారు!

ప్రజలే ట్రాఫిక్ పోలీసులుగా వ్యవహరిస్తున్నారు. వాహన చోదకులు నిబంధనలు ఉల్లంఘిస్తే సెల్‌ఫోన్‌తో చిత్రీకరించి ఆ సమాచారాన్ని 'పోలీస్ మిత్ర' వెబ్‌సైట్‌కు చేరవేస్తున్నారు.

8లో ▶

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:35	ఉ॥ 4:54
ఆదోని	సా॥ 6:38	ఉ॥ 4:57
నంద్యాల	సా॥ 6:35	ఉ॥ 4:51
ఆత్మకూరు	సా॥ 6:33	ఉ॥ 4:52
బనగానపల్లె	సా॥ 6:36	ఉ॥ 4:52

హదీస్ వెలుగు :

'ఉపవాసం ఉన్న వారి దీక్షను విరమింపజేసేందుకు పంచభక్ష పరమాన్నం పెట్టాల్సిన అవసరం లేదు. ఆర్థిక స్థోమత లేకపోతే ఒక ఖర్జూరం, గుక్కెడు మజ్జిగ తాపించినా అంతే పుణ్యం దక్కుతుంది.' – పవిత్ర గ్రంథం ఖురాన్

ఈ వేసవి హాట్ గురూ!

మార్చిలోనే భానుడు భగభగ

- ఇప్పటికే సాధారణం కంటే 3–4 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత
- మే నెలలో 48 డిగ్రీలు దాటే అవకాశం
- ఎండల తీవ్రతకు తోడవుతున్న వడగాల్పులు
- ఆందోళన కలిగిస్తున్న వాయు కాలుష్యం
- ఉపాధి కూలీల రక్షణకు డ్వామా చర్యలు

గత ఏడాది ఇదే సమయంలో 36 నుంచి 37 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ఏడాది మార్చి నెల రెండో వారంలోనే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరడం గమనార్హం. ఈ నెల 14న కౌతాళం మండలం కామవరం గ్రామంలో 39.6, కోడుమూరులో 39.5, పెద్దకడుబూరు మండలం హెచ్.మురవణిలో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కొద్ది రోజుల క్రితం అకాల వర్షాలతో ఉష్ణోగ్రతలు తగ్గినప్పటికీ మూడు, నాలుగు రోజులుగా భానుడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. ఈ నెల చివరిలోపు ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు, ఏప్రిల్ నెలలో 45 డిగ్రీలు, మే నెలలో 48 డిగ్రీలకు చేరే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.



ఉపాధి పని ప్రదేశంలో నీడ కల్పించిన దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): గత మూడు నాలుగేళ్లతో పోలిస్తే ఈ వేసవి భగ్గుమనే అవకాశం కనిపిస్తోంది. వాతావరణ శాఖ కూడా ఇదే హెచ్చరిక జారీ చేస్తోంది. మార్చి మొదటి పక్షం నుంచే ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఇక ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణోగ్రతలు ఏ స్థాయిలో ఉంటాయో ఊహించవచ్చు. ఇప్పటికే సాధారణం కంటే 2–3 డిగ్రీలకుపైగా అధికంగా నమోదు అవుతుండటం గమనార్హం. ఉపాధి కూలీలు వడదెబ్బకు గురికాకుండా జిల్లా నీటియాజమాన్య సంస్థ చర్యలు చేపట్టింది. షేడ్‌నెట్‌లు, ఫస్ట్ ఎయిడ్ కిట్స్ సరఫరా చేస్తోంది. ఈ సారి ఒకవైపు అధిక ఉష్ణోగ్రతలు, ఇంకోవైపు వడగాలుల బెడద తీవ్రంగా ఉండే ప్రమాదం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దెబ్బతింటున్న ఓజోన్ పొర

ఓజోన్ పొరకు చీలికలు వస్తుండటం వల్ల ఎండల తీవ్రత అధికమవుతోంది. సూర్యుడి నుంచి వచ్చే అతినీల లోహిత కిరణాల నుంచి భూమిని కాపాడే కవచం ఓజోన్ పొర. అడవులను ఇష్టానుసారం నరికేస్తుండటం, కాలుష్యం పెరుగుతుండటంతో ఓజోన్ పొర నానాటికీ దెబ్బతింటోంది. ఈ కారణంగా మనుషులకే కాదు.. భూమిపై ఉన్న జంతువులు, పక్షులు, చెట్లకూ ప్రమాదం పొంచి ఉంది.

వడదెబ్బకు గురి కాకుండా ఉండాలంటే..

తలనొప్పి, తల తిరగడం, తీవ్రమైన జ్వరం కలిగి ఉండటం, మత్తునిద్ర, ఫిట్స్, పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితి ఇవన్నీ వడదెబ్బ లక్షణాలు. రానున్న రోజులు అధిక ఎండలు, వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉండే ప్రమాదం ఉన్నందుకు ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఉపాధి పనులు, పొలం పనులకు వెళ్లి వారు సాధ్యమైనంత వరకు ఉదయం 11 గంటల్లోపు ఇంటికి చేరుకోవాలి. ఎండలో బయటికి వెళ్లాల్సి వచ్చినప్పుడు గొడుగు తీసుకెళ్లాలి. కనీసం తలపైన టోపి లేదా తువాల కప్పుకోవాలి. కళ్ల రక్షణకు సన్ గ్లాసెస్ ఉపయోగించాలి. దాహం వేయకపోయినా తరచూ చల్లని నీరు ఎక్కువగా తీసుకోవాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు, కొబ్బరి నీళ్లు వీలైనంత వరకు ఎక్కువగా తాగాలి. వేసవిలో నల్లని దుస్తులు ధరించరాదు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య శారీరక శ్రమతో కూడిన పనులు చేయరాదు.

ఉష్ణోగ్రతలు పెరగడానికి కారణాలు..

- అడవులు తరిగిపోతుండటం, పచ్చదనం కనుమరుగు అవుతుండటం.
- జిల్లా విస్తీర్ణంలో అడవులు 33 శాతం వరకు ఉండాలి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో అడవులు 16 శాతం మాత్రమే.
- వాయు కాలుష్యం పెరగటం. వాహనాల సంఖ్య అధికమవడం.

ఏం చేస్తే మేలు..

- ఓజోన్ పొరను కాపాడుకోవాలంటే చెట్లను పెంచి అడవులను అభివృద్ధి చేయాలి.
- సంప్రదాయ ఇంధన వనరుల స్థానంలో సోలార్ విద్యుత్ వాడకాన్ని పెంచాలి.
- కాలుష్యాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలి.
- పంటల్లో కెమికల్స్ వాడకాన్ని తగ్గించాలి.

ఎండల తీవ్రత ఎక్కువే..



ఈ వేసవిలో ఉష్ణోగ్రతలు పతాక స్థాయికి చేరే అవకాశం ఉంది. ప్రస్తుతం సాధారణ ఉష్ణోగ్రతల కంటే రెండు డిగ్రీల వరకు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. ఏప్రిల్ నెలలో 45, మే నెలలో ఉష్ణోగ్రతలు 48 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉంది.

– మహదేవయ్య, వాతావరణ శాస్త్రవేత్త, బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం

రెండు పూటల పనులు ఉత్తమం



ఎండల తీవ్రత నుంచి ఉపాధి కూలీలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఉదయం 5 గంటలకే వెళ్లి 11 గంటల్లోపు ఇంటికి చేరుకునేలా కూలీలకు అవగాహన కల్పిస్తున్నాం. అవసరమైతే సాయంత్రం 4 గంటలకు వెళ్లి పనులు చేసుకోవచ్చు. ఎండల బారిన పడకుండా రెండు పూటల పనిచేసుకోవడం ఉత్తమం. అప్పుడే గిట్టుబాటు వేతనం లభిస్తుంది. పనిప్రదేశంలో ఇప్పటికే పంపిణీ చేసిన షేడ్‌నెట్‌లను ఏర్పాటు చేసుకోవాలి.

– అమరనాథరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా



కొత్తపల్లి మండలంలోని సప్తనది సంగమేశ్వరాలయంలో ఆదివారం పూజలు చేస్తున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్

రైల్వే విద్యుత్ పనుల తనిఖీ



బేతంచెర్ల రైల్వే స్టేషన్‌లో ప్యానల్ బోర్డు నిర్మాణ పనులను తనిఖీ చేస్తున్న అధికారులు

బేతంచెర్ల: గుంటూరు– గుంతకల్ రైలు మార్గంలో చేపట్టిన రైల్వే విద్యుత్ డబుల్ లైన్ పనులను కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ అధికారి ప్రణజీవ్ సక్సేనా, చీఫ్ అడ్మిస్ట్రేషన్ అధికారి నీరజ్ అగర్వాల్, గుంతకల్ డీఆర్ఎం కే. వెంకట్రామణారెడ్డి తనిఖీ చేశారు. బేతంచెర్ల రైల్వే స్టేషన్ నుంచి ఆర్ఎస్ రంగాపురం, డోన్ మండలం మల్కాపురం వరకు సుమారు రూ. 200 కోట్లతో 25.50 కి.మీ. మేర చేపట్టిన విద్యుత్ డబుల్ లైన్, స్టేషన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ మేరకు వారు బేతంచెర్ల రైల్వే స్టేషన్‌లో ప్యానల్ బోర్డ్స్, రెండవ ప్లాట్ ఫారమ్ నిర్మాణ పనులు పరిశీలించారు. అలాగే ట్రాక్‌పై స్పీడ్ టెస్టు పరికరాలతో ట్రాక్‌ను పరిశీలించి వేగ నిర్ధారణ చేశారు. వారి వెంట చీఫ్ ఇంజినీర్లు సాయి ప్రసాద్, బ్రహ్మానందరెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ వరుణ్ బాబు ఉన్నారు.

న్యూస్‌రీల్

శ్రీమఠంలో కేంద్ర మంత్రి



కేంద్ర మంత్రి నారాయణస్వామికి జ్ఞాపికను అందజేస్తున్న శ్రీ మఠం పీఠాధిపతి

మంత్రాలయం రూరల్: కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి నారాయణస్వామి ఆదివారం మంత్రాలయం వచ్చారు. గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థులు ఫల, పుష్ప, మంత్రాక్షిలిచ్చి ఆశీర్వదించారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ కేంద్రాలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లోని సచివాలయాల పరిధిలో ఈ నెల 27, 28, 29వ తేదీల్లో మొబైల్ ఆధార్ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పీ కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తగా ఆధార్ నమోదు చేసుకునేవారు, నమోదు పూర్తి అయి ఆధార్ కార్డు పొందాలనుకునే వారు, 0 నుంచి 5 సంవత్సరాలు, 5 నుంచి 16 సంవత్సరాల బాలబాలికలు ఈ కేంద్రాలను వినియోగించుకోవచ్చన్నారు. ఇంటి చిరునామా, మొబైల్ నంబర్, ఫొటో మార్చుకోదలచిన వారు, వేలి ముద్రలు, బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలనుకునే వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2010 నుంచి 2016 సంవత్సరాల మధ్య ఆధార్ నమోదు చేసుకొని ఇప్పటి వరకు ఒక్కసారి కూడా అప్‌డేట్ చేసుకోని వారు విధిగా ఆధార్ కేంద్రాలను సందర్శించాలని సూచించారు.

31న జాబ్ మేళా

నంద్యాల(అర్బన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆధ్వర్యంలో స్థానిక ఈఎస్సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 31న గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ గ్రీన్‌టెక్, సిగని, అరవిందో కంపెనీలు హాజరయ్యే జాబ్ మేళాకు జిల్లాలోని పాలిటెక్నిక్ డిప్లొమో, ఎస్‌సీసీ, ఇంటర్, ఐటీఐ, బీఎస్సీ(కెమిస్ట్రీ), బీఫార్మసీ, బీటెక్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు హాజరు కావచ్చన్నారు. అభ్యర్థులు వారి చదువుకు సంబంధించిన సర్టిఫికెట్ల జిరాక్స్‌తో పాటు బయోడేటా ఆధార్ కార్డులతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 9440224291, 9440434766ను సంప్రదించాలన్నారు.

ఆదివారం కూడా కొనసాగిన రిజిస్ట్రేషన్ సేవలు



కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సేవల కోసం వచ్చిన ప్రజలు

కర్నూలు(సెంట్రల్): ఉమ్మడి జిల్లాలోని 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆదివారం సెలవు రోజైనా సేవలు కొనసాగాయి. ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో లక్ష్యాల సాధన కోసం ఆదివారం కూడా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పనిచేయాలని ఆ శాఖ కమిషనర్ నిర్ణయించిన విషయం విదితమే. ఈ క్రమంలో ఆదివారం కూడా రిజిస్ట్రేషన్ సేవలు ప్రజలకు అందుబాటులోకివచ్చాయి. వీటికి అనుబంధంగా 51 బ్యాంకు బ్రాంచ్‌లు కూడా పనిచేశాయి.



జనవాహిని మధ్య వీరభద్ర స్వామి రథోత్సవం

'వీర' భక్తి.. ఉత్సవ దీప్తి

ఆస్పరి: వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం కైరుప్పల గ్రామంలో రథోత్సవం కనుల పండవగా సాగింది. ముందుగా ఆలయంలో వీరభద్ర స్వామి, కాళికాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఊరేగిస్తూ రథం వద్దకు తీసుకెళ్లారు. రథాంగ పూజల అనంతరం ఉత్సవ విగ్రహాలను రథంపై అధిష్టింపజేశారు. జయ జయ ధ్వనుల మధ్య భక్తులు స్వామి వారి రథాన్ని బసవన్న దేవాలయం దగ్గరకు, అక్కడ నుంచి రథశాల వద్దకు లాగారు. రథోత్సవాన్ని చూడటానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. ఉత్సవంలో గొరవయ్యల నృత్యం ఆకట్టుకుంది. వేడుకల్లో ఆలయ నిర్వాహణాధికారి రాంప్రసాద్, సర్పంచ్ తిమ్మక్క, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శిఖరేశ్వరం వద్ద ఎలుగుబంటి



కొబ్బరిచిప్పలను తింటున్న ఎలుగుబంటి

శ్రీశైలం: శ్రీశైల క్షేత్రపరిధిలోని శిఖరేశ్వరం వద్ద ఎలుగుబంటి సంచరిస్తోంది. మూడు రోజులుగా సాయంత్రం వేళ శిఖరేశ్వరం వద్దకు రావడం, అక్కడ భక్తులు కొట్టిన కొబ్బరి చిప్పలు తిని వెళ్తోంది. భక్తులకు ఎలాంటి హాని చేయడం లేదని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. కొందరు భక్తులు ఎలుగుబంటిని వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో వైరల్ అవుతోంది.

నెలాఖరు వరకు కేసీ కాల్వకు నీరు

జూపాడుబంగ్లా: ఈనెలాఖరు వరకు కర్నూలు–కడప కాల్వకు సాగునీరు సరఫరా అయ్యే అవకాశాలున్నాయని కేసీ కాల్వ ఏఈలు నరేష్, శ్రీనివాసులు నాయక్ తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ఓ పంపు నుంచి సరఫరా అవుతున్న సాగునీరు శ్రీశైలం డ్యాంలో నీటిమట్టం పూర్తిగా తగ్గిపోవటంతో ఆదివారం సాయంత్రం నుంచి నిలిపివేసినట్లు తెలిపారు. సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 1,600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నీరు లాకిన్స్‌లా వరకు 1,200 క్యూసెక్కులు చేరుతుండగా అందులో 200 క్యూసెక్కులు తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు, 1,000 క్యూసెక్కులు నిప్పులవాగుకు విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

రూ. 3 లక్షల విరాళం



దాతకు అన్నదాన బాండును అందజేస్తున్న శ్రీశైల దేవస్థాన అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న వివిధ పథకాలకు ఆదివారం పలువురు దాతలు రూ. 3 లక్షల విరాళం అందజేశారు. గో సంరక్షణ నిధికి గుంటూరుకు చెందిన నరేష్ రూ.1,01,116, సూర్యపేటకు చెందిన వెలగల శషాంక్ రూ.1,00,001 అందజేశారు. అలాగే అన్నప్రసాద వితరణ పథకానికి గుంటూరుకు చెందిన విజయ లక్ష్మి రూ.1,01,116 విరాళంగా అందజేశారు. దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, విరాళానికి సంబంధించిన బాండును అందజేశారు.



మహా జనసభలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మహాలక్ష్మి

డీసీసీబీ టర్నోవర్ రూ.3,500 కోట్లు

- సహకార సంఘాలకు డివిడెండు
- 70 సహకార సంఘాల్లో రూ.10 కోట్ల వ్యాపారం
- మహాజనసభలో చైర్‌పర్సన్ మహాలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) రూ.3500 కోట్ల టర్నోవర్‌తో రాష్ట్రంలో ఐదో అతి పెద్ద బ్యాంకుగా అభివృద్ధి చెందిందని చైర్‌పర్సన్ మహాలక్ష్మి తెలిపారు. డీసీసీబీ మహాజన సభ పాతబస్టాండు సమీపంలోని ఓల్డ్‌టౌన్ బ్రాంచీలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. 2022 మార్చి 31 నాటికి ఉన్న నష్టాలను పూర్తిగా అధిగమించి రూ.3.05 కోట్లు లాభాలు సాధించామన్నారు. ఈ లాభాల్లోంచి 0.30 శాతంతో అన్ని సహకార సంఘాలకు డివిడెండ్ కూడా పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది సహకార సంఘాల ద్వారా 10,630 మంది రైతులకు వివిధ పథకాల కింద రూ.460.44 కోట్లు రుణాలుగా పంపిణీ చేసినట్లు వివరించారు. నంద్యాలలో రీజినల్, బనగానపల్లెలో బ్రాంచ్ కార్యాలయాల నిర్మాణాలకు మహాజనసభ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 99 సహకార సంఘాలు ఉండగా..70 సహకార సంఘాలు రూ.10 కోట్లకుపైగా వ్యాపారం చేసి ఏ కేటగిరీ కింద చేరినట్లు తెలిపారు. ఇప్పటికీ రూ.2కోట్ల లోపు వ్యాపారం చేస్తున్న సహకార సంఘాలు 4 ఉన్నాయని, ఇవి కూడా రికవరీలను పెంచుకుంటే వృద్ధిలోకి వస్తాయన్నారు. 25 సహకార సంఘాలను బహుళ సేవా కేంద్రాలుగా అభివృద్ధి చేసినట్లు వివరించారు. డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.రామాంజనేయులు మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరం మరో ఐదు రోజుల్లో ముగియనుందని, రికవరీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. డీసీసీబీ పాలకవర్గ సభ్యులు సీమ సుధాకర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, వెంకటేశ్వరమ్మ, ఐసీడీపీ సీపీవో వెంకటకృష్ణ, ఆప్కాబ్ డీజీఎం విజయకుమార్, పీఏసీఎస్ చైర్మన్‌లు పాల్గొన్నారు.

ప్రజ్వలించిన జ్యోతులు.. ప్రణమిల్లిన భక్తులు

- వైభవంగా చౌడేశ్వరి జ్యోతి మహోత్సవం
- ఆకట్టుకున్న తొగటవీర క్షత్రియుల కత్తిసాము ప్రదర్శన



శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారు

బనగానపల్లెరూరల్: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన నందవరం చౌడేశ్వరి మాత జ్యోతి మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. జ్యోతులు ప్రజ్వలించగా.. భక్తి భావం ఉప్పొంగింది. 'చౌడేశ్వరి దేవి చల్లగా దీవించి తల్లీ' అంటూ భక్తులు ప్రణమిల్లారు. ఆంధ్ర, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో నందవరం గ్రామం భక్తజన సంద్రంగా మారింది. ఈ నెల 22న ప్రారంభమైన జ్యోతి మహోత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి కీలక ఘట్టానికి శ్రీకారం చుట్టారు. ఆలయ సంప్రదాయంలో భాగంగా ముందుగా భాస్కరయ్య ఆచారిచే అమ్మ వారికి దిష్టి చుక్క పెట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఒంటిగంట సమయంలో స్థానిక శ్రీ చెన్నకేశస్వామి దేవస్థానం వద్ద ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన తొగట వీరక్షత్రియులు, అమ్మ వారి భక్తులు గోధమ పిండి, నెయ్యి, బెల్లం తదితర ప్రత్యేక పదార్థాలతో జ్యోతులు తయారు చేసి తలపై ఉంచుకొని అమ్మవారి భక్తిగీతాలు ఆలపిస్తూ మేళతాళాలతో ఆలయానికి బయలుదేరారు. మొదట సర్కార్ వారి జ్యోతిని భక్తులు తీసుకోస్తుండగా ఈ జ్యోతి వెంట మిగిలిన జ్యోతులు ప్రదర్శనగా గ్రామచావిడి, బస్టాండ్ మీదుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నాయి. జ్యోతులతో వచ్చిన భక్తులు ఆలయం ఎదుట అగ్నిగుండంలో నడుచుకుంటూ గర్భగుడిలో కొలువైన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. తొగటవీర క్షత్రియులు ప్రదర్శించిన కత్తి సాము ప్రదర్శన ఆకట్టుకుంది. జ్యోతుల ముందు కత్తి సాము ప్రదర్శను భక్తులు ఆసక్తిగా తిలకించారు.



అమ్మవారి ఆలయానికి చేరుకున్న జ్యోతులు

భారీగా తరలివచ్చిన భక్తజనం

గతంలో ఎప్పుడూ లేనంతగా జ్యోతులు అధిక సంఖ్యలో రావడంతో పాటు భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. క్యూలైన్లు కిక్కిరిసిపోయి అమ్మవారి దర్శనానికి గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, బనగానపల్లె సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐ రామాంజనేయరెడ్డిల ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మతో పాటు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. సాయంత్రం శ్రీ చౌడేశ్వరిదేవి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి రథోత్సవాన్ని నిర్వహించారు.

క్లుప్తంగా

వడదెబ్బతో మహిళ మృతి

రుద్రవరం: ఆలమూరుకు చెందిన పార్నపల్లె శంకరమ్మ (41) ఆదివారం వడదెబ్బకు గురై మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మొక్కజొన్న కంకులు కోసేందుకు ఉదయాన్నే పొలానికి వెళ్లి సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు పొలం వద్దకు వెళ్లి చూడగా పొలంలో శంకరమ్మ విగత జీవిగా కనిపించింది. ఎండ తీవ్రంగా ఉండటంతో వడదెబ్బకు గురై మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతురాలికి భర్త శేఖర్, కుమారుడు ఉన్నారు.

ప్రాణం తీసిన పిడుగు


మృతి చెందిన వెంకటరమణ

గడివేముల: నంద్యాల జిల్లా గడివేముల మండల పరిధిలోని గని గ్రామానికి చెందిన వెంకటరమణ (33) ఆదివారం సాయంత్రం పిడుగు పడి మృతి చెందాడు. తనకు ఉన్న 15 గేదెలను మేపుకునేందుకు ఉదయం పొలానికి వెళ్లాడు. సాయంత్రం భారీగా గాలు వీయడంతో పాటు వడగండ్ల వర్షం కురిసి అతని సమీపంలోనే పిడుగు పడింది. దీంతో శరీరంపై బొబ్బలు ఏర్పడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటరమణ మృతదేహం వద్ద భార్య శోభరాణి, కుమార్తెలు స్రవంతి, మేఘన విలపిస్తున్న తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది.

గుర్తు తెలియని శవం లభ్యం

గూడూరు రూరల్: కె.నాగలాపురం పోలీసు స్టేషన్ పరిధిలోని పర్ల రోడ్డులోని పొలంలో గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమైనట్లు ఎస్‌ఐ సోమ్లానాయక్ తెలిపారు. పర్ల రోడ్డులోని పాత వైన్ షాపు వెనుక పొలంలో 45 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి మృత దేహం పక్కన పురుగు మందు డబ్బా ఉండటంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏమార్చి.. రూ. 2.80 లక్షలు అపహరించి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో సినీ ఫక్కీలో చోరీ జరిగింది. దొంగలు తోటి ప్రయాణికులుగా నటిస్తూ ఓ బండల వ్యాపారి వద్ద రూ.2.80 లక్షలు అపహరించారు. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కల్లూరు మండలం లక్ష్మీపురానికి చెందిన రంగస్వామి కల్లూరు ఎస్టేట్‌లో బండల ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి సొంత పని మీద రూ.2.80 లక్షలు తీసుకుని హైదరాబాద్ వెళ్లేందుకు కొత్త బస్టాండ్‌కు చేరుకున్నాడు. అప్పటికే అక్కడ మాటు వేసిన ఇద్దరు దొంగలు రంగస్వామి బస్సు ఎక్కే సమయంలో ఏమార్చి అతని వద్ద ఉన్న నగదును అపహరించి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజీను పరిశీలించి ఆరుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

పౌర పోలీసులు చూస్తున్నారు!

- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించొద్దు
- సత్ఫలితాలిస్తున్న 'ట్రాఫిక్ మిత్ర'
- మూడు వారాల వ్యవధిలో 2,990 ఫిర్యాదులు
- కర్నూలు పోలీస్ వెబ్‌సైట్‌కు అనూహ్య స్పందన



కర్నూలు: రహదారిపై వెళ్లే వాహనదారుడు నిబంధనలను ఉల్లంఘిస్తే ఎవరు చిత్రీకరిస్తారు? ట్రాఫిక్ పోలీసులు.. లేదంటే రోడ్లపై అమర్చిన సీసీ కెమెరాలు మాత్రమే అనుకోకండి.. మీ చుట్టూరా నిఘా నేత్రాలు పొంచివున్నాయి. ఎక్కడైనా ఉల్లంఘనలకు పాల్పడితే టపీమని క్లిక్ మనిపించేందుకు అవి సదా సిద్ధంగా ఉన్నాయని మరచిపోకండి. అవే తోటి వాహనదారులు, ప్రజల చేతుల్లోని సెల్‌ఫోన్లు. ఎవరైనా ఇష్టానుసారంగా వాహనాన్ని నడుపుతూ కంట పడితే వెంటనే సెల్‌ఫోన్‌తో చిత్రీకరించి ట్రాఫిక్ పోలీసులకు ఆ సమాచారాన్ని చేరవేస్తున్నారు. ఒకరో, ఇద్దరో ఇలా చేస్తున్నారనుకుంటే మీరు తప్పులో కాలేసినట్లే. సగటున రోజుకు 10–15కు పైగా ఈ తరహా ఉల్లంఘనలు నమోదవుతున్నాయంటే ఈ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. రహదారులపై ట్రాఫిక్ నిబంధనలు పట్టించుకోకుండా నడిపే వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధిస్తారు. అది వారి కంటికి కనిపించినప్పుడు మాత్రమే, లేదంటే సీసీ కెమెరాల్లో గుర్తిస్తేనే ఉల్లంఘన నమోదయ్యేది. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని సిబ్బంది ఈ చిత్రాల ఆధారంగా జరిమానాలు విధిస్తారు. అనంతరం ఆర్టీఏ డేటా బేస్‌లోని వాహనదారుని అడ్రస్ ఆధారంగా ఈ–చలానా ఇంటికి పంపిస్తారు. ఇలా ఐదు కంటే ఎక్కువ జరిమానాలు పెండింగ్‌లో ఉంటే ట్రాఫిక్ పోలీసులు వాహనాన్ని నడి రోడ్డుపైనే ఆపేసి స్వాధీనం చేసుకుంటారు. అవసరమైతే వారిపై న్యాయస్థానంలో చార్జిషీటు దాఖలు చేసే పరిస్థితి ఉంది. అప్పుడు తప్పనిసరిగా ఊచలు లెక్కించాల్సిందే. ఈ ప్రక్రియ ఇప్పటికీ కొనసాగుతోంది.

పౌర పోలీసులే కీలక భూమిక

ఉల్లంఘన చిత్రీకరణలో తోటి వాహనదారులే కీలక భూమిక పోషిస్తున్నారు. వారే పౌర పోలీసుల పాత్ర పోషిస్తూ చేతిలో ఉండే సెల్‌ఫోన్ ఇందుకు అస్త్రంగా ప్రయోగిస్తున్నారు. జిల్లా పరిధిలో ఈ తరహా పౌర పోలీసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మూడు వారాల్లో 'ట్రాఫిక్ మిత్ర' పోలీస్ వెబ్‌సైట్‌కు 2,990 మంది ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ప్రజలు పంపిన ఫొటోలు, వీడియోల ఆధారంగా ట్రాఫిక్ పోలీసులు నిర్ధారణ చేసి 162 మందికి రూ.లక్ష దాకా జరిమానా విధించారు.

పోలీసుల సత్వర స్పందనతో...

రహదారులపై ప్రయాణించేటప్పుడు మరో వాహనదారుడు ఎవరైనా ట్రాఫిక్ నియమాన్ని ధిక్కరిస్తే కొందరు వెంటనే స్పందిస్తున్నారు. తమ చేతిలోని సెల్‌ఫోన్‌లో ఉల్లంఘనను చిత్రీకరించి పోలీస్ కంట్రోల్ రూమ్ విభాగానికి ఫిర్యాదు చేస్తున్నారు. ఇందుకోసం http://kurnoolpolice.in/trafficmitra/ వెబ్‌సైట్‌కు సమాచారం పంపిస్తే చాలు, పోలీసులు సత్వరమే స్పందిస్తున్నారు. వచ్చిన ఫిర్యాదును ట్రాఫిక్ విభాగానికి పంపి నిర్ధారించుకుని అనంతరం ఈ–చలానా విధించి మెసేజ్ రూపంలో వాహనదారులకు, అటు ఫిర్యాదుదారులకు పంపుతున్నారు. ఏ ఉల్లంఘనకు ఎంత మొత్తం జరిమానా విధించాలనే విషయాన్ని తెలియజేస్తున్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం...

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం జిల్లా పోలీసు శాఖ ఈనెల 3వ తేదీ 'ట్రాఫిక్ మిత్ర' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కర్నూలు నగరంలో సుమారు 6 లక్షల జనాభా ఉంది. రోజురోజుకూ కాలనీలు విస్తరిస్తున్నాయి. అంతకు రెట్టింపు స్థాయిలో వాహనాల సంఖ్య కూడా పెరిగింది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రధాన రహదారుల్లో సుమారు 40 దాకా పాయింట్లు ఉన్నాయి. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ప్రస్తుతం 70 మంది మాత్రమే సేవలందిస్తున్నారు. అన్ని పాయింట్లలో సిబ్బంది విధులు నిర్వహించడానికి కష్టతరమైంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు ఏ విధంగా సేవలు అందించాలనే ఆలోచనలు, సలహాలు కోరుతూ పౌరుల భాగస్వామ్యానికి ఆహ్వానం పలుకుతూ 'వాహన మిత్ర' పేరుతో కర్నూలు పోలీస్ వెబ్‌సైట్‌ను రూపొందించారు.

వెబ్‌సైట్‌లో నమోదు చేయాల్సిన వివరాలు...

ట్రిబుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ పార్కింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం, సీటు బెల్టు ధరించకుండా కారు నడపడం వంటి ఉల్లంఘనలపై పోలీస్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి ట్రాఫిక్ మిత్ర కాలంలో వివరాలు నమోదు చేయాలి.

మూడు వారాల్లో ఉల్లంఘనులపై వచ్చిన ఫిర్యాదులు – 2,990
వీటిలో జరిమానాలు విధించినవి – 162 మందిపైన
నెంబర్ ప్లేట్లు లేనివాటిపై ఫిర్యాదులు – 25
ట్రాఫిక్ రద్దీపై వచ్చిన సూచనలు, సలహాలు – 37
పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులు – 91

ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు...



ట్రాఫిక్ ఉల్లంఘనుల గురించి ఫిర్యాదు చేసే వెసులుబాటును పౌరులెవరైనా వినియోగించుకోవచ్చు. ఇందుకు పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లక్కర్లేదు. 'ట్రాఫిక్ మిత్ర' పోలీస్ వెబ్‌సైట్‌కు కాని లేదా వాట్సాప్ ద్వారా సులభంగానే ఫిర్యాదు చేయవచ్చు. ఉల్లంఘనకు సంబంధించిన చిత్రంతో పాటు జరిగిన ప్రాంతం, తేదీ, వాహనం నంబర్, సమయం తదితర సమాచారాన్ని పొందుపరచాలి. తప్పుడు సమాచారాన్ని పోస్టు చేయకూడదు.

– ఎం.నాగభూషణం, ట్రాఫిక్ డీఎస్పీ, కర్నూలు

డీసీసీబీలో అధికారుల బదిలీకి రంగం సిద్ధం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్రబ్యాంకులో పనిచేస్తున్న సీనియర్ అధికారుల బదిలీలకు రంగం సిద్ధం అయింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ సహకార కేంద్రబ్యాంకు(ఆప్కాబ్) ఉత్తర్వులు జారీ చేసింది. రీజినల్ స్థాయిలోనే సీనియర్ అధికారుల బదిలీలు జరుగుతాయి. జిల్లా సహకార కేంద్రబ్యాంకులో జనరల్ మేనేజర్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్లు సీనియర్ అధికారులుగా ఉన్నారు. ఇదే బ్యాంకులో నియమితులై.. పదవీ విరమణ వరకు ఇక్కడే కొనసాగుతున్నారు. మొదటిసారిగా సీనియర్ అధికారుల బదిలీలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లా సహకార కేంద్రబ్యాంకుల్లో అవినీతికి తావు లేకుండా..పరిపాలనను పారదర్శకంగా ఉండాలనే లక్ష్యంతో బదిలీలు చేపడుతుండటం విశేషం. కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకులో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న శివలీల (ప్రస్తుతం నంద్యాల జిల్లా రీజినల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు), డిప్యూటీ జనరల్ మేనేజర్లు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్‌కుమార్, నాగిరెడ్డి రీజినల్ స్థాయిలో అంటే రాయలసీమలోని ఇతర జిల్లాలకు బదిలీ కానున్నారు. వీరి స్థానాల్లో రాయలసీమ జిల్లాల నుంచి జీఎం, డీజీఎంలు ఇక్కడికి బదిలీపై రానున్నారు. సీనియర్ అధికారుల బదిలీలకు రీజినల్ స్థాయిలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు అయింది. ఆప్కాబ్ చైర్మన్ ఝాన్సీరాణి, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనాథరెడ్డి రాయలసీమ జిల్లాల డీసీసీబీ చైర్మన్‌లు కమిటీలో ఉంటారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో బదిలీల ప్రక్రియ జరుగునుంది. సీనియర్ అధికారుల బదిలీలకు ఆదివారం జరిగిన డీసీసీబీ మహాజనసభ కూడా ఆమోదం తెలిపింది.

చిన్నమల్కాపురంలో మహిళ హత్య


మృతి చెందిన నాగేశ్వరమ్మ

డోన్ రూరల్: పొలానికి వెళ్లి తిరిగి వస్తూ చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన నాగేశ్వరమ్మ హత్యకు గురయ్యారు. డోన్ రూరల్ ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు.. భర్త మృతి చెందడంతో నాగేశ్వరమ్మ గ్రామంలో ఒంటరిగా జీవిస్తోంది. పొలం పనులు చేస్తూ ఇద్దరు సంతానాన్ని పోషిస్తోంది. ఆదివారం ఉదయం పొలానికి వెళ్లిన ఆమె సాయంత్రం గ్రామ సమీపంలో రక్తపు మడుగులో కనిపించింది. గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారాన్ని అందించారు. ఘటన స్థలాన్ని రూరల్ ఎస్‌ఐ సురేష్ పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు బండరాళ్లతో కొట్టి చంపి ఉంటారని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని, విచారణ జరుపుతున్నామన్నారు.

కాలంచెల్లిన కూల్‌డ్రింక్స్ విక్రయం

- షాపు యజమానిపై కేసు నమోదు


తనిఖీలో బయటపడిన కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్

పత్తికొండ రూరల్: స్థానిక పబ్లిక్ రీడింగ్‌రూం షాపింగ్ కాంప్లెక్స్‌లోని గౌస్ కూల్‌డ్రింక్‌షాపులో ఆదివారం కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ లభ్యం కావడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు. వేసవికాలం కావడంతో కూల్‌డ్రింక్‌షాపులో ఒక కూల్‌డ్రింక్ కొనుగోలు చేసి తాగేందుకు ప్రయత్నించగా విక్రయ గడువు ముగిసి ఉండటాన్ని సీఐ గమనించారు. అనుమానం వచ్చి తరువాత సిబ్బందితో షాపును తనిఖీ చేయగా షాపులోని కూల్‌డ్రింక్స్, వాటర్‌బాటిల్స్ అన్నీ కాలంచెల్లిపోయినవి ఉన్నాయి. విషయాన్ని ఫుడ్‌సేఫ్టీ అథారిటీ వారికి రిపోర్టు చేసి షాపు యజమాని గౌలిసుబాన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ ప్రోత్సాహం

- ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి


జ్యోతి వెలిగించి సమావేశాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి తదితరులు

నంద్యాల: పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఉదయానంద రెసిడెన్సీలో ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీ పోచా, ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ రాష్ట్ర చైర్మన్ కల్లూరు రామలింగారెడ్డి, ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణప్రసాద్, భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎంపీ పోచా మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు నంద్యాల జిల్లా అనువైందన్నారు. సహజ వనరులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. పారిశ్రామిక అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పరిశ్రమల ఏర్పాటులో ఏవైన సమస్యలు ఉంటే ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ నాయకులు తమ దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వం ద్వారా పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలో వ్యాపార వృద్ధిని, పరిశ్రమల సమస్యలను పరస్పరం చర్చించుకుని పరిష్కరించుకునేందుకు ఏపీ చాంబర్స్ వేదికగా మారిందన్నారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ రాష్ట్ర చైర్మన్ కల్లూరు రామలింగారెడ్డి మాట్లాడుతూ త్వరలో నంద్యాల జిల్లా ఏపీ చాంబర్స్ కమిటీని నూతనంగా నియమిస్తామన్నారు. పరిశ్రమల స్థాపనపై అవగాహన, పట్టు సాధించేందుకు వీలుగా ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఏర్పడిందని, ఉత్సాహవంతులు ఇందులో చేరాలని కోరారు. సమావేశంలో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రెజరర్ అక్కయ్యనాయుడు, ఉపాధ్యక్షుడు కేవీ చౌదరి, రాయలసీమ జోన్ చైర్మన్ విజయ్‌కుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ రంగారెడ్డి, నెరవాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాటకం.. రసరమ్యం

- నాటక రంగస్థల కేంద్రంగా కర్నూలు
- రాణిస్తున్న కళాకారులు
- నంది, గరుడ పురస్కారాలు కైవసం
- నేడు అంతర్జాతీయ రంగస్థల దినోత్సవం


పౌరాణిక నాటకంలో ఓ సన్నివేశం

కర్నూలు కల్చరల్: కావ్యేషు నాటకం రమ్యం అన్నారు పెద్దలు. నాటక రచన రమ్యమైతే ప్రదర్శన రమ్యాతి రమ్యం. అలాంటి రమ్యాతి రమ్యమైన నాటకమనే మహా వృక్షానికి ప్రేక్షకులు గాలి, నీరు లాంటి వారు. నటులు ఆ వృక్షానికి పూసే పూలు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఐదారు దశాబ్దాలుగా నాటక రంగం మహా వృక్షంలా ఎదుగుతూ వస్తోంది. సోమవారం అంతర్జాతీయ రంగస్థల దినోత్సవం. ఈ సందర్భంగా రంగస్థల నాటకాల గురించి ప్రత్యేక కథనం.

ఉమ్మడి జిల్లాలో రంగస్థల ప్రస్థానం ఇలా..

నంద్యాలలో హరిసింగ్ కంపెనీ సురభి కుటుంబానికి చెందిన వారు లంకా దహనం, వెంకటేశ్వర మహత్యం తదితర నాటకాలు జనరంజకంగా ప్రదర్శించే వారు. కోడుమూరు, పోలకల్, లొద్దిపల్లె, వెల్దుర్తి వంటి ప్రాంతాల్లో సమాజ నాటక ప్రదర్శనలు వచ్చాయి. కల్లూరు నుంచి శేషయ్య ఔత్సాహిక కళాకారులను చేరదీసి నటులుగా తీర్చిదిద్దారు. ఆయన తీర్చి దిద్దిన రాయలసీమ రత్నమే వెల్దుర్తి వెంకటనర్సు నాయుడు. పెద్దపాడు పాండురంగయ్య, కల్లూరు లక్ష్మయ్యలు ఆయన శిష్యులే. అదే సమయంలో గాయక శిఖామణి హార్మోనిస్టు, దుర్గారావు వెంకటేశ్వర్లు, వీరరాజు రామకోటి తదితరులు వెలుగులోకి వచ్చారు. లొద్దిపల్లె ఎం. అల్లాబకాష్ ఆంధ్ర నాటక కళాసమితి ద్వారా వెయ్యికి పైగా సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శనలు ఇచ్చారు. కేవీ చలపతి కృషి ఫలితంగా కర్నూలులో లలిత కళాసమితి ఏర్పడి పలు నాటకాలు ప్రదర్శనలు ఇస్తూ నంది పురస్కారాలకు చిరునామాగా నిలిచింది.

జాతీయ స్థాయిలో ప్రదర్శనలు...

నవ్యాంధ్రలో కర్నూలు రంగస్థలానికి కేంద్రంగా మారింది. తరచూ రాష్ట్రస్థాయి నాటక పోటీలకు వేదికగా మారుతోంది. నంది, గురుడ, ఉగాది పురస్కారాలను కైవసం చేసుకోవడంతో జాతీయ స్థాయి ఉత్తమ నాటకంగా, ఉత్తమ కళాకారులుగా జిల్లా కళాకారులు నిలుస్తున్నారు. కర్నూలులో 1970లో లలిత కళాసమితి ఆరుబయట కళా మందిరంగా ప్రారంభమై 2009లో అన్ని హంగులు గల థియేటర్‌గా మారి కళాక్షేత్రం పేరుతో నాటక ప్రదర్శనలు ఇస్తోంది. కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య ఆధ్వర్యం, దర్శకత్వంలో ప్రదర్శించిన నాటకాలకు 37 నంది అవార్డులు వరించాయి. ఇంకా వీణ అవార్డులు, ఎన్‌టీఆర్ పరిషత్ ఒంగోలు అవార్డులు, అభినయ, అశ్వం అవార్డులు ఎన్నో సాధించింది. రాయలసీమ ముఠాకక్షలపై పులిస్వారీ నాటకం 150 ప్రదర్శనలు ఇచ్చింది. వీటితోపాటు బభ్రువాహన విజయం, నరనారాయణ, కర్ణ, మాధవప్రస్థానం, సైరా నరసింహారెడ్డి, శ్రీకృష్ణ కమలపాలిక వంటి పౌరాణిక నాటకాలను ప్రదర్శిస్తోంది. గురుస్వామి, వెంకట నర్సునాయుడు, బీసీ కృష్ణ, రజనీబాయి, సంజన్న, బాబ్జి, సింహం లక్ష్మీనారాయణ, చంద్రన్న, శారదా బాయి వంటి నటులు ప్రముఖ రంగస్థల కళాకారులుగా వెలుగొందారు.

నాటక పోటీలు నిర్వహించాలి



నాటక రంగానికి ప్రజలు, ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తేనే మనుగడ ఉంటుంది. టీవీలు, సినిమాలు, ఓటీటీ, హార్డ్‌స్టార్‌ల వేగంలో రంగస్థల కళ మరుగున పడుతోంది. ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నాటకపోటీలు నిర్వహిస్తే కళాకారులకు అండగా నిలిచినట్లు అవుతుంది. కళాపోషకులు ముందుకు వచ్చి మన సంస్కృతికి ప్రతిబింబాలైన నాటకాల ప్రదర్శనలకు సహకారం అందించాల్సిన అవసరం ఉంది. – పత్తి ఓబులయ్య, అధ్యక్షులు, టీజీవీ కళాక్షేత్రం

కళాకారులను ప్రోత్సహించాలి



రంగస్థల కళాకారులకు ప్రత్యేక ప్రోత్సాహం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రవృత్తిగా కళారంగాన్ని ఎంచుకున్న వారికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. కళారంగమే వృత్తిగా ఎంచుకున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. రంగస్థల కళాకారులను గుర్తించి వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తేనే వారి జీవితం బాగుటుంది. క్రమశిక్షణ గల కళాకారులకు ప్రేక్షకాదరణ ఉంటుంది.

– గాండ్ల లక్ష్మన్న, సీనియర్ కళాకారుడు

వ్యవసాయ విస్తరణపై అవగాహన పెంచండి


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాఘవేంద్ర

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ విస్తరణ, వ్యవసాయంలో చీడపీడల నివారణకు సలహాలు, సూచనలు పొందేందుకు అనేక అవకాశాలు అందుబాటులోకి వచ్చాయని, వీటిపై అవగాహన పెంచుకొని రైతులు కూడా సద్వినియోగం చేసుకునే విధంగా చూడాల్సిన అవసరం ఉందని కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర ఇన్‌పుట్ డీలర్లకు వివరించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమ కోర్సుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ... ప్రధానంగా టెలీకాన్ఫరెన్స్‌లు, దృశ్యశ్రవణ మాధ్యమాలు తదితర వాటి నుంచి విస్తరణకు సంబంధించిన విషయాలపై అవగాహన పెంచవచ్చన్నారు. అదేవిధంగా ఏవైన తెగుళ్లు, పురుగుల నివారణ గురించి రైతులు తెలుసుకోవడానికి భారత ప్రభుత్వం 1800–180–1551 టోల్‌ఫ్రీ నంబరును ఏర్పాటు చేసిందన్నారు. రైతులు టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి సలహాలు, సూచనలు పొందవచ్చని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, మార్కెట్ సమాచారం తదితర వాటిని కూడా సులభంగా తెలుసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో విశ్రాంత డీడీఏ, దేశీ డిపామా కోర్స్ సమన్వయ కర్త నాగేంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సెలవురోజు పన్ను వసూలు రూ.36 లక్షలు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో 2022–2023 ఆర్థిక సంవత్సరం మరో 5 రోజుల వ్యవధిలో ముగుస్తుంది. దీంతో పన్నుదారుల కోసం నగరపాలక సంస్థ అధికారులు సెలవురోజు ఆదివారం పన్ను కౌంటర్లు తెరవడంతో ప్రజలు ఆస్తి పన్ను, నీటి పన్నులు చెల్లించారు. ఆస్తిపన్ను రూ.34,13,802, నీటి పన్ను రూ.2,64,579లు కలిపి మొత్తం రూ.36,78,381లు వసూలు అయ్యినట్లు నగరపాలక మేనేజర్ చిన్నరాముడు వెల్లడించారు. ఎండలు ఉండటంతో పన్నుదారుల కోసం కౌంటర్ల వద్ద మంచినీటి సౌకర్యం, షామియానులు ఏర్పాటు చేశామన్నారు.